మేలు మరువం

ప్రజాసేవే లక్ష్యంగా ప్రభుత్వం ప్రవేశ పెట్టిన వలంటీర్ వ్యవస్థను అన్నివర్గాల ప్రజలు కొనియాడుతున్నారు. వలంటీర్లు ప్రజల వద్దకే నేరుగా వచ్చి సమస్యలు పరిష్కరిస్తుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. గతంలోని టీడీపీ ప్రభుత్వానికి భిన్నంగా అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను వలంటీర్లు సకాలంలో అందజేస్తున్నారని తెలియజేశారు. కోవిడ్ విపత్తు సమయంలో వలంటీర్ వ్యవస్థ ఓ రక్షణ కవచంలా ప్రజల ప్రాణాలు కాపాడిందని మెచ్చుకుంటున్నారు. కష్ట సమయాల్లో వలంటీర్లు చేసిన సేవలు మరువలేమని చెబుతున్నారు. వలంటీర్లపై విమర్శలు చేయడం సరి కాదని హితవు పలుకుతున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

అండగా నిలిచిన వలంటీర్



నా పేరు సాడి రామారావు. మాది ఇచ్ఛాపురం నియోజకవర్గం మండపల్లి గ్రామం. నేను రోడ్డు ప్రమాదంలో కుడి కాలును పోగొట్టుకున్నాను. ఈ పరిస్థితిలో పింఛన్‌కు అవసరమైన సదరం సర్టిఫికెట్ కోసం పలుమార్లు ఆఫీసుల చుట్టూ తిరిగినా ఫలితం కనిపించలేదు. ఈ పరిస్థితుల్లో మా గ్రామ వలంటీర్ రవి బెహరా నాకు అండగా నిలబడ్డాడు. నాకు తోడుగా శ్రీకాకుళం వచ్చి క్షణాల్లో సర్టిఫికెట్ చేయించి పింఛన్ వచ్చేలా చేశాడు. అంతేకాదు ప్లాస్టిక్ కాలు వచ్చేందుకు కృషి చేశాడు. నేను డ్రైవర్‌ను కావడంతో ప్రస్తుతం గుంటూరులో టాటా ఏసీ బండిని నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాను. ప్రతీనెలా స్వగ్రామానికి వచ్చి పింఛన్ అందుకుంటున్నాను.

– సాడి రామారావు, మండపల్లి, ఇచ్ఛాపురం

వలంటీరే ఆదుకున్నాడు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు నిమ్మన దమయంతి. వివాహం కాకపోవడంతో ఒంటరి మహిళ పింఛను కోసం టీడీపీ హయాంలో ఆఫీసుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగింది. కానీ ఫలితం లేకపోయింది. ఇక తనకు పింఛన్ వస్తుందనే ఆశలు వదులుకున్న తరుణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పుడు ఆ క్లస్టర్‌కు వలంటీర్‌గా నియామకమైన అల్లాడ సాయి ఆమె సమస్యను తెలుసుకున్నాడు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి పింఛన్ మంజూరయ్యేలా కృషి చేశాడు. ప్రస్తుతం ఆమె ప్రతి నెలా సక్రమంగా ఒకటో తేదీ నాటికే పింఛన్ అందుకొని సంతోషంగా జీవిస్తోంది.

– నిమ్మన దమయంతి, మందస

కష్టకాలంలో సేవలు



కరోనా సమయంలో మందుల కిట్లు అందజేస్తున్న వలంటీర్లు ప్రశాంతి, అరుణ

కరోనా మహమ్మారి విజృంభించిన సమయంలో బాధితులను కలవడానికి సొంత కుటుంబ సభ్యులే భయపడిన పరిస్థితులు నెలకొన్న విషయం మనకు తెలిసిందే. అలాంటి విపత్కర సమయంలోనూ వజ్రపుకొత్తూరు మండలం సీతాపురం గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్లు కుసుమూరి ప్రశాంతి, హనుమంతు అరుణలు ప్రాణాలకు లెక్క చేయకుండా సేవలు అందించారు. కరోనాతో బాధపడుతున్న వారిని కలిసి అప్యాయంగా పలకరిస్తూ, వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. కోవిడ్ మందుల కిట్లను సక్రమంగా అందించి తోడుగా నిలిచారు. హోమ్ క్వారంటైన్‌లో ఉన్నవారికి కావాల్సిన కూరగాయలు, నిత్యావసర సరుకులు అందించి అండగా నిలిచారు.

– వజ్రపుకొత్తూరు రూరల్

సొంత మనుషుల్లా చూశారు



కరోనా బాధితుడి వివరాలను నమోదు చేస్తున్న వలంటీర్ రోజా

కరోనా కష్టకాలంలో తమ వద్దకు బంధువులే రాలేని సమయంలో ప్రభుత్వం నియమించిన వలంటీర్లే తమను సొంత మనుషుల్లా చూసుకున్నారని సిల్ల కృష్ణ అన్నారు. స్థానిక కచ్చేరి వీధికి చెందిన కృష్ణ, అతని కుటుంబ సభ్యులకు 2020లో కరోనా వచ్చింది. ఆ పరిస్థితుల్లో ఎవరూ దగ్గరకు రాని సమయంలో తమ వలంటీర్ లావేటి రోజా తమకు ఎంతో సహాయం అందించిందని గుర్తు చేసుకున్నారు. తమ వివరాలు నమోదు చేసి కరోనా నివారణ కిట్లను అందించడంతో పాటు ఆశవర్కర్లను తమ ఇంటికి తీసుకొచ్చి చికిత్స అందేలా చూసిందన్నారు.

'లక్ష్యాలు పూర్తి చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న సెర్ప్ అధికారులు

మందస: వైఎస్సార్ క్రాంతి పథం ద్వారా కొత్తగా మంజూరైన పథకాల లక్ష్యాలను పూర్తి చేయాలని సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.వి.రమేష్, ఏపీఎం గొడబ ప్రసాదరావు, హెచ్ఆర్ ఏపీఎం సుబ్బయ్యనాయుడు అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో పీఎం ఈజీపీ, పీఎం ఎఫ్ఎంఈ పథకాల అవగాహన సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి ప్రభుత్వ పథకాలు దోహదం చేస్తున్నాయన్నారు. కొత్తగా మరిన్ని పథకాలు మంజూరయ్యాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పీఎం ఈజీపీ, పీఎం ఎఫ్ఎంఈ తదితర పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీసీలు లక్ష్యాలను నెరవేర్చాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో అకౌంటెంట్ కల్యాణి, సీవో ఎస్.రాజా, సీసీ ముఖలింగం, గణపతిరావు, తారకమోహన్, తేజేశ్వరరావు, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు



కవిటి: కొత్తపాలెం తీరం వద్ద గస్తీలో పాల్గొన్న ఎస్ఐ రాము సిబ్బంది



ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగ జంక్షన్‌లో గస్తీ పోలీసులకు సూచనలిస్తున్న ఎస్ఐ రమేష్

ఇచ్ఛాపురం రూరల్: సముద్ర మార్గం గుండా అపరిచితులు ఒడిశా వైపునకు వస్తున్నట్లు సమాచారం మేరకు తీరప్రాంత మత్స్యకార గ్రామాల్లో గస్తీ ఏర్పాటు చేసినట్లు రూరల్ ఎస్ఐ వి.రమేష్ తెలిపారు. బుధవారం ఆయన డొంకూరు, ఇన్నేసుపేట, డొంకూరు పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గస్తీని పరిశీలించారు. రెండు రోజుల పాటు గస్తీని ఏర్పాటు చేస్తున్నామని, అపరిచిత వ్యక్తులు కనిపిస్తే తమకు సమాచారం అందివ్వాలని స్థానికులను కోరారు.

కవిటి: మండలంలోని సీహెచ్ కపాసుకుద్ధి నుంచి ఒంటూరు వరకు ఉన్న అన్ని తీరప్రాంత గ్రామాల్లో సాగర్ కవచ్ పేరిట నిర్వహించిన తీరప్రాంత గస్తీ(కోస్టల్ ఎక్సర్‌సైజ్) బుధవారం పటిష్టంగా నిర్వహించారు. ఎస్ఐ కె.రాము ఆధ్వర్యంలో మండలంలోని తొమ్మిది తీరప్రాంత గ్రామాలతో పాటు ప్రధాన కూడళ్లలో 30 మంది పోలీసులు గస్తీ నిర్వహించారు. స్థానికులు అనుమానాస్పదంగా కనిపించిన వారికి సంబంధించిన కదలికలపై నిఘా వేసి, సమాచారాన్ని తమకు అందించాలని కోరారు. దీనిలో భాగంగా పలు జంక్షన్లలో ఆటోలు, కారులను తనిఖీ చేశామన్నారు.

పవన్ కల్యాణే అసలైన సంఘ విద్రోహి

● వలంటీర్ల మండిపాటు



మాట్లాడుతున్న మహిళా వలంటీర్లు

వజ్రపుకొత్తూరు: వలంటీర్ వ్యవస్థపై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న పవన్ కల్యాణే అసలైన సంఘ విద్రోహి అని వలంటీర్లు మండిపడ్డారు. మండలంలోని కంబాల రాయుడుపేటలో వలంటీర్లు డబ్బీరు ఝాన్సీ, కంబాల శిరీష, కె.సత్య, కె.పద్మలత, జుత్తు గీత, కె.ధనలక్ష్మిలు విలేకరులతో బుధవారం మాట్లాడారు. కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు చేస్తే, కళ్లులేని కబోదిలా పవన్ మాట్లాడడం సిగ్గుచేటు అన్నారు. దుర్మార్గపు వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని, లేదంటే భారీమూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. లారీ ఎక్కి నోటికొచ్చినట్లు మాట్లాడితే సహించేది లేదన్నారు. ఇకనైనా చౌకబారు మాటలు మానుకోవాలని హితవు పలికారు. వారితో పాటు వలంటీర్ కె.హారతి, శివాజీ, రాజేష్, కె.ప్రదీప్, రమేష్, డి.మూర్తి తదితరులు ఉన్నారు.

'ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి'



వ్యాపారులకు సూచనలిస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు

టెక్కలి రూరల్: రోజురోజుకీ పెరుగుతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు నిత్యం కృషి చేస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక ఇందిరాగాంధీ జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వైపు వెళ్లే రహదారిపై ఫుట్‌పాత్ వ్యాపారుల షాపులు రోడ్డు పైకి రాకుండా చూసుకోవాలని ఎస్ఐ-2 రమేష్ బాబు బుధవారం కోరారు. వాహనదారులు సామగ్రి కొనుగోలు చేసేందుకు రోడ్డుపైనే వాహనాలను ఆపుతుండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. షాపులను రోడ్లకు దూరంగా వేసుకోవాలని సూచించారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

సోంపేట: మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు దుద్ది శ్రీనివాసరావు, పి.వి.రమణ అన్నారు. పట్టణంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మొక్కలు బుధవారం నాటారు. కార్యక్రమంలో డాక్టర్ రమేష్, కె.రవికుమార్, టంకాల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

12వ వార్డులో గుడ్ మార్నింగ్ పలాస

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 12వ వార్డులో గుడ్ మార్నింగ్ పలాస కార్యక్రమం బుధవారం చేపట్టారు. వార్డు కౌన్సిలర్ పోతనపల్లి ఉమాకుమారి ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు వార్డులో పర్యటించి పలు సమస్యలపై చర్చించారు. ఆయనతో పాటుగా వైస్ చైర్మన్ బోర కృష్ణారావు, ప్రభుత్వ విప్ శంకర్ పండా, కమిషనర్ రాజగోపాలరావు, వార్డు ఇన్‌చార్జి పోతనపల్లి హరిప్రసాద్, చెరుకుపల్లి నేతాజీ, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగింపు

కోటబొమ్మాళి: మండలంలోని దుప్పలపాడు కొప్పలపేట పరిధి కూర్మన్న పూను చెరువులోని ఆక్రమణలను డిప్యూటీ తహసీల్దార్ రఘుపతి మధు ఆధ్వర్యంలో అధికారులు తొలగించారు. చెరువు గర్భాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి వచ్చిన ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టారు.

సంక్షిప్తంగా ...

రోడ్డు పనులు పరిశీలన

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో చిన బడం నుంచి అంతరకుడ్డ వరకు చేపడుతున్న బీటీ రోడ్డు పనులను అధికారులు, నాయకులు బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బి.గిరిబాబు, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, 2వ వార్డు నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు నేరుగా చేరవచ్చు

నందిగాం: మండల కేంద్రంలో ఉన్న బాలయోగి గురుకులంలో వివిధ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం అర్హత కలిగిన విద్యార్థులు నేరుగా కార్యాలయంకు వచ్చి చేరవచ్చని ప్రిన్సిపాల్ దమయంతి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 26, 7వ తరగతిలో 18, 8వ తరగతిలో 20, తొమ్మిదో తరగతిలో 10 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆయా సీట్లన్నింటికీ ఎస్సీ కేటగిరీకు చెందిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కవిటి: మండల విద్యాశాఖలో పనిచేస్తున్న ఉద్యోగికి వచ్చిన అనారోగ్య సమస్యపై ఉపాధ్యాయ వర్గాలు ఉదారంగా స్పందించడం అభినందనీయమని కవిటి, మందస మండలాల ఎంఈవోలు ధనంజయ మజ్జి, మత్రిపాటి లక్ష్మణరావులు అన్నారు. మండలంలోని ఆర్.బెలగాం స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో సీఆర్పీగా సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న జీరు జయరాం ఇటీవల కిడ్నీవ్యాధి బారినపడ్డారు. దీంతో విషయం తెలుసుకున్న ఉపాధ్యాయులు తమవంతుగా అతని వైద్యానికి కొంత మొత్తాన్ని సేకరించారు. ఈ మేరకు సేకరించిన రూ.75,000 నగదును బుధవారం అందజేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కవిటి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాజెక్ట్ డైరెక్టర్ పీకే సింగ్ అన్నారు. మండలంలోని కొజ్జీరియా సమీపంలో ఉన్న టోల్ ప్లాజా ఆవరణలో ధర్మపురం ఉన్నత పాఠశాల చిన్నారులు, ఉపాధ్యాయులు, టోల్‌ప్లాజా సిబ్బంది సంయుక్తంగా మొక్కలు నాటే కార్యక్రమం బుధవారం నిర్వహించారు.

నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరి

కంచిలి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మనబడి నాడు–నేడు పనుల్లో తప్పనిసరిగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి సూచించారు. మండలంలోని కొల్లూరు పంచాయతీ పరిధి అరవసరియాపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చేపడుతున్న పనులను బుధవారం ఆయన పరిశీలించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేత పైల లక్ష్మీనారాయణ ఉన్నారు.

ఫీల్డు అసిస్టెంటుపై డ్వామా పీడీకి ఫిర్యాదు

కోటబొమ్మాళి: కోటబొమ్మాళి-2 ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంటు మంచాల స్వాతిపై డ్వామా పీడీ జి.వి.చిట్టిరాజుకు బుధవారం ఫిర్యాదు చేసినట్లు సర్పంచ్ కాళ్ల సంజీవరావు ఒక ప్రకటనలో తెలిపారు. చనిపోయిన, వలస వెళ్లిన వారిపేర్లతో మస్టర్లు వేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ లక్షలాది రూపాయల అవినీతికి పాల్పడినట్టు సర్పంచ్ పేర్కొన్నారు. ఈ విషయమై ఇటీవల జరిగిన గ్రామసభలో ప్రస్తావించి ప్రశ్నించగా తనతో పాటు ఫిర్యాదుచేసిన వేతనదారులను దూషించినట్టు చెప్పారు. ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని సర్పంచ్ కోరారు.

జోరుగా 'జగనన్న సురక్ష'



కవిటి: వరకలో ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు



సంతబొమ్మాళి: కె.లింగూడులో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న దువ్వాడ వాణి



మందస: సొండిపూడిలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ దానయ్య తదితరులు



వజ్రపుకొత్తూరు: కంబాలరాయుడు పేటలో ధ్రువపత్రాలు అందజేస్తున్న శ్రీనివాసరావు తదితరులు



ఇచ్ఛాపురం: ధ్రువపత్రాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి



ఇచ్ఛాపురం రూరల్: కొఠారీలో లబ్ధిదారులకు ధ్రువపత్రాలు అందజేస్తున్న లోకేశ్వరరావు తదితరులు



పలాస: లొత్తూరులో ధ్రువపత్రాలు అందజేస్తున్న అధికారులు



వజ్రపుకొత్తూరు రూరల్: గరుడభద్రలో ధ్రువపత్రాలు అందజేస్తున్న నాయకులు, అధికారులు



నందిగాం: కాపుతెంబూరులో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎంపీపీ శ్రీరామమూర్తి తదితరులు

ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో జగనన్న సురక్ష క్యాంపులు జోరుగా సాగుతున్నాయి. దీనిలో భాగంగా సాంకేతిక సమస్యలతో పథకాలు అందనివారి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నారు. కావాల్సిన ధ్రువపత్రాలను వెంటనే జారీ చేస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

క్లుప్తంగా

ఏకగ్రీవంగా పీఆర్ ఉద్యోగుల ఎన్నికలు



పీఆర్ ఉద్యోగుల నూతన కార్యవర్గం సభ్యులు

ఇచ్ఛాపురం రూరల్: ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి మండలాల పరిధిలో పనిచేస్తున్న ఏపీ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎన్నికల అధికారి ఎల్.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కె.రామారావు, ఉపాధ్యక్షుడిగా వి.దేవీప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాసరెడ్డి, కోశాధికారిగా వీఆర్ పాణిగ్రాహి, జిల్లా కౌన్సిలర్లు 1, 2లుగా వి.సత్యాదేవి, ఎం.శ్రీధర్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు.

మందస: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం మందస పాతసమితి యూనిట్(మందస, సోంపేట మండలాల)కు సంబంధించిన ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఎన్నికలు అధికారి ఎల్.శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగాయి. అధ్యక్షునిగా మన్మథరావు(సీనియర్ సహాయకులు, సోంపేట), కార్యదర్శిగా ఎన్‌కేటీ శర్మ, ఉపాధ్యక్షుడిగా హెచ్.సురేష్, సంయుక్త కార్యదర్శిగా బి.ఢిల్లీ, కోశాధికారిగా ఎం.కామేశ్వరమ్మ, జిల్లా కౌన్సిలర్లుగా డి.ధర్మారావు, పి.భీమారావులతో కార్యవర్గం ఎన్నిక జరిగింది. నూతన సభ్యులకు ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



పీహెచ్‌సీ పరిసరాలను పరిశుభ్రం చేస్తున్న దృశ్యం

టెక్కలి: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరమవుతాయని మండలంలోని కె.కొత్తూరు పీహెచ్‌సీ వైద్యులు ఎస్.గాయత్రీ, భాగ్యశ్రీ అన్నారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పీహెచ్‌సీ ఆవరణలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా వర్కర్లు, పీహెచ్‌సీ సిబ్బంది సంయుక్తంగా పరిసరాలను పరిశుభ్రం చేశారు. పరిసర ప్రాంతాల్లో పేరుకుపోయిన పిచ్చి మొక్కలను తొలగించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొత్త శాసనాం ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీపీ బోర పుష్ప మాట్లాడుతూ.. ప్రస్తుతం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో ఉపాధ్యాయులు ఉండడం గొప్ప విషయమన్నారు. కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని కోరారు. హెచ్ఎం ఎ.చిరంజీవిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, రంగాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

కంచిలి: ప్రకృతి వ్యవసాయం రైతుకు లాభదాయకమని ప్రకృతి వ్యవసాయం మండల యాంకర్ టి.వివానందం అన్నారు. మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధి యు.బొనమాళి గ్రామంలో రైతు రెడ్డి శశిభాస్కర్‌కు చెందిన 30 సెంట్ల పొలంలో బుధవారం చేపట్టిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ పొలంలో 365 రోజులు ఆదాయం వచ్చే విధంగా చిరుధాన్యాలు, కూరగాయలు, పప్పుదినుసులు, ఆకుకూరలు, దుంప జాతి నిరంతరం సాగవుతాయన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది మండల యాంకర్ కుమారి, పీఆర్పీ తులసయ్య, ఐసీఆర్పీ కామరాజు, సుహాసిని, నాగమణి, శ్రీదేవి హాజరయ్యారు.

ఎస్పీని కలిసిన దువ్వాడ వాణి



ఎస్పీ రాధికకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వాణి

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ జి.ఆర్.రాధికను టెక్కలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దువ్వాడ వాణి మర్యాదపూర్వకంగా బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్ఛం అందించారు.